# వెన్నెల కురిసిన రాత్రి

అడుసుమల్లి మల్లికార్జున

అంత వరకు దిగులుగా వున్న ఇందిర వదనం, నాగలక్ష్మి రాకతో వికసించింది.

"ఏమిటేఁ కబురెట్టావ్?" అంటూ వొచ్చింది నాగలక్ష్మి.

ఇందిర, నాగలక్ష్మి ఇద్దరూ చిన్నతనం నుంచి మంచి స్నేహంతో పెరిగారు. నలభై వత్సరాలు దాటినా వారి మధ్య సాన్నిహిత్యం, ప్రేమ నిత్య నూతనంగానే వుంది. ఎప్పుడైన అవసరమైన సలహా కావలసి వొస్తే– నాగలక్ష్మిని ఆశ్రయిస్తుంది – ఇందిర. ఇప్పుడు కూడా అదే పరిస్థితి ఏర్పడింది.

ఇందిర ఒక్కగా నొక్క కూతురు వసంత. చక్కని అందంతో, పచ్చగా కళకళ లాడుతూ, అప్పుడే యవ్వనంలోకి అడుగు పెట్టింది. వసంతను చూసి– బ్యాంక్‌లో ఉద్యోగిస్తున్న రవి కట్నం లేకుండా పెళ్లి చేసుకుంటా నన్నాడు. వాళ్ళ పెద్దల ద్వారా అడిగించాడు.

కుర్రాడు అందంగా వున్నాడు. మంచి ఉద్యోగం. సాంప్రదాయమైన కుటుంబం. ఇన్ని మంచి లక్షణాలున్న కుర్రాడు పైసా కూడా కట్నం వొద్దంటున్నాడు. అంతకంటె ఏం కావాలి? ఇందిర ఆనందంతో పొంగి పోయింది.

కాని వసంత వొప్పుకోలేదు.

తన కిప్పుడే పెళ్ళి చేసుకోవటం ఇష్టం లేదని గట్టిగా చెప్పింది.

ఎంత బ్రతిమాలినా ససేమిరా అంటుంది.

అనుకున్నప్పుడల్లా అట్లాంటి సంబంధం వొస్తుందా? వేలకు వేలు పోసి కొంటున్నా రవి లాంటి ఉత్తమకుర్రాడు దొరకటం లేదు. అట్లాంటిది కోరి వచ్చిన సంబంధాన్ని వొదులుకోవటం ఇందిరకు ఇష్టం లేదు. అన్నిమార్లు అవకాశం వొస్తుందా? వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవటం మంచిదన్న భావంతోనే నాగలక్ష్మికి కబురు పెట్టింది.

జరిగిన సంగతి అంతా చెప్పి కన్నీళ్ళు పెట్టుకుంది ఇందిర.

"చిన్న పిల్ల. దానికేం తెలుసు. వింటుందిలే" ఓదార్పుగా అంది నాగలక్ష్మి.

"అది మూర్ఖంగా వుంది. ఎన్ని విధాల చెప్పినా లాభం లేక పోయింది. నువ్వే ఏదో ఒక మార్గం చెయ్యాలి" అంది ఇందిర.

వసంతకు నాగలక్ష్మి దగ్గర మంచి చనువు నాగలక్ష్మి చెప్తే ఏమైనా మార్పు వొస్తుందేమో నని ఇందిర ఆశ.

"కుర్రాడు నచ్చలేదేమో" సాలోచనగా అంది నాగలక్ష్మి.

"ఆ విషయం కూడా అడిగి చూశాం. అదేం కాదట. అసలు ఇప్పుడు చేసుకోదట. వయసు దాటాక దీని ముఖం ఎవరు చూస్తారు". అని తటాలున నాగలక్ష్మి ముఖంలోకి చూసింది– పొరపాటు మాట్లాడినట్టు.

నాగలక్ష్మి అదేమి పట్టించుకోలేదు.

"నువ్వేమి ఆలోచన పెట్టుకుని మనసు పాడు చేసుకోకు– నేను మాట్లాడుతాను" అంది.

* * *

"అత్తయ్యా" అంటూ లేడిపిల్లలా ఛెంగున గెంతుతూ హుషారుగా వచ్చిన వసంత వొంక ఆప్యాయంగా చూసింది నాగలక్ష్మి.

"ఏమిటేవ్! అంత సంబరం".

"ఈరోజు మన పడక ఇక్కడే. అమ్మ చెప్పింది. నీకు తోడు" అంది పక్కనే కూచుంటూ.

నాగలక్ష్మి అర్థం చేసుకుంది.

"అబ్బో! పెద్ద తోడు" అంది నవ్వుతో.

వసంత కూడ నవ్వుతో పుస్తకాలు చూడ్డం మొదలెట్టింది. పుస్తకాల్లో పడితే ఆ పిల్లను ఎవ్వరూ 'డైవర్ట్' చెయ్యలేరు. అందానికి ప్రతీకలా వున్న వసంతను చూస్తూ మౌనంగా వుండి పోయింది– నాగలక్ష్మి.

ఆ రాత్రి – వెన్నెల్లో పడక వేశారు.

లేత వెన్నెల అప్పుడే లోకమంతా పరుచుకుంటోంది. అక్కడక్కడ మిణుకు మిణుకు మనే తారకల మధ్య చిన్ని చంద్రుడు వెన్నెల దీపంలా వున్నాడు. ఆకాశం కింద పడుకున్న అనుభూతి చిత్రంగా వుంది. హృద్యమైన వెన్నెల సోయగం చూస్తూ రవంత సేపు ఎక్కడో ఆలోచిస్తూ వుండి పోయింది నాగలక్ష్మి.

ప్రక్కనే పడుకున్న వసంత ఏదో పుస్తకం చూస్తూ వుంది.

గడిచి పోయిన తన జీవితం – ఆ పిల్లలో మార్పు తెచ్చినా, తేకున్నా– ఆకథంతా చెప్పుకోవటం వలన తనకు ఆత్మసంతృప్తి కలుగుతుందని పించింది.

నెమ్మదిగా అంది నాగలక్ష్మి.

"ఎందుకనో ఈ రోజు నాకథ అంతా నీకు చెప్పాలనిపిస్తోంది."

వసంత 'వూఁ' అంది కాని పుస్తకంలోనే లీనమై వుంది.

"నువ్వెప్పుడూ అడిగేదానివి–" అత్తయ్యా! నువ్వు పెళ్ళి ఎందుకు చేసుకోలేదు" అని– చెప్పనా?" అంది.

ఆ మాటతో తటాలున తల తిప్పి, పుస్తకం ప్రక్కన పడేసి–

"చెప్పు అత్తయ్యా" అంది ఆత్రుతగా.



వసంత ఆ విషయం ఎప్పుడు అడిగినా నవ్వుతో సంభాషణ మార్చే నాగలక్ష్మి ఈ రోజు తనకై తను చెప్పటం ఎంతో ఆనందమైంది - వసంతకి.

నాగలక్ష్మి అత్తయ్య ఎందుకు పెళ్లి చేసుకోలేదో - అంతుపట్టని సమస్య వసంతకి. నాగలక్ష్మి అత్తయ్యకు ఇంత వయసు వొచ్చినా - కళ తగ్గలేదు. వయసులో ఎంత అందంగా వుండి వుంటుందో - ఎవరి వూహకైనా ఇట్టే తోస్తుంది. అట్లాంటి ఆవిడ పెళ్లి ఎందుకు చేసుకోలేదో అర్థంకాలేదు.

అందుకే - లేచి కూచొని ఆసక్తిగా చూసింది.

ఆకాశంలో చందమామ కూడ మరింత కాంతితో మెరిశాడు.

నాగలక్ష్మి గతంలోకి వెళ్లింది.

అప్రయత్నంగా ఆమె పెదవులు కదిలాయి - చిన్నగా.

ఆ రోజుల్లో -

మీ అమ్మ, నేను కలిసి కాలేజికి వెళ్తుండేవాళ్లం. కాలేజిలో అందరి చూపులూ నా వైపే. ఎవరైనా నా వొంక చూడలేదంటే - ఆ మాట విచిత్రంగా చెప్పుకునేవాళ్లు. అన్నీ గమనిస్తున్నా, తెలీనట్లే ప్రవర్తించేదాన్ని.

అందం తెచ్చిన గర్వం నాలో నిండుగా వుండేది. అందుకే ఎవర్నీ లెక్క చేసేదాన్ని కాదు. కాలేజి ఆఖరు సంవత్సరం చదువుతున్నాను. కాలేజిలో కొత్తగా చేరిన కుర్ర లెక్చరర్ నేనంటే ఇష్టపడి నన్ను అడిగాడు.

మీకు అభ్యంతరం లేకుంటే పెళ్లి చేసుకుంటాను" అన్నాడు.

"నేను నవ్వుకున్నాను. నా అందం అంటే మాటలా!!

"సారీ" చెప్పి వొచ్చేశాను.

అప్పుడు బరువు, బాధ్యతలు లేవు. జీవితం అంటే ఏమిటో తెలీదు. నవ్వుతో, ఆనందంగా వుండటమే. లోకమంతా పచ్చగా, హాయిగా కనిపించేది. భవిష్యత్ గురించి ఆలోచనలే వుండేవికాదు.

కాలేజి వొదిలి బైటపడ్డాక కూడ నాలో మార్పు రాలేదు. పక్కింటివాళ్లు, స్నేహితులు ఎప్పుడూ నా అందం గురించి ఏదో ఒక మాట అనటం. నేను మరింత గర్వంగా వుండిపోవటం జరుగుతూ వుండేది.

ఒకసారి మా బంధువుల పెళ్లి జరుగుతుంటే నెల్లూరు వెళ్లాను. అక్కడ పెళ్లిలో ఓ కుర్రాడు ఇష్టపడి - వాళ్ల అమ్మగారి ద్వారా అడిగించాడు. కుర్రాడు చాలా అందంగా వున్నాడు. మంచి ఉద్యోగం కూడ చేస్తున్నాడు.




అయినా నేను ఒప్పుకోలేదు.

కారణం ఏమిటో నాకే తెలీదు.

ఇంట్లో కోప్పడ్డారు. మీ అమ్మ కూడ వొచ్చి బ్రతిమాలింది. నా ధోరణి నాదే. ఎందుకు కాదన్నానో ఈనాటికి నాకు అర్థంకాని ప్రశ్న అది.

తర్వాత కూడ చాలా సంబంధాలు వొచ్చాయి. కట్నం తక్కువైనా ఫర్లేదన్నారు. కానీ గర్వంతో, అందంతో - నాకే తెలీని ఒక విధమైన మూర్ఖత్వంతో కళ్ళ ముందే అన్నిటిని వొదులుకున్నాను.

నాలుగైదు వసంతాలు గిర్రున తిరిగాయి.

మీ అమ్మకు పెళ్లి కుదిరింది.

"నాగూ! నువ్వు తొందర్లో పెళ్లి చేసుకోవాలి" అంటూ నా తలలో తెల్లబడ్డ వెంట్రుకల్ని కనపడకుండా సరి చేసింది - మీ అమ్మ.

ఎన్నడూ లేనిది ఒక్కసారిగా భయంతో నిండి పోయింది - నా మనసు. అక్కడక్కడ వెంట్రుకలు తెల్లబడుతున్నాయి. తలస్నానం చేస్తే అగుపిస్తున్నాయి. అంతేకాదు. పూర్వంలా నా ముఖంలో లేతదనం, మృదుత్వం సన్నగిల్లు తున్నట్లు అనుమానం కలిగింది.

కాలప్రభావం ఎలాంటిదో అర్థమైంది. మీ అమ్మ సుఖంగా అత్తవారింట్లో కాపురం చేసుకుంటూ, ఎప్పుడైనా వొచ్చి పలకరించేది. నేను మూర్ఖత్వంతో వొదులుకున్న సంబంధాలను గుర్తుతెచ్చి బాధపడేది.

నాకూ అప్పుడు ఆలోచన కలిగేది. అంత మంచి సంబంధాలు ఎందుకు వొదులుకున్నానా? అనిపించేది. ఏ ఇంజనీరో, డాక్టరో రావాలని కూడా కోరుకున్నది లేదు. మరి ఎందుకట్లా చేశానో!! ఒక్కటే కారణం ఐ వుండాలి. "నేను అందగత్తెను ఎప్పటికైనా నన్ను ఇష్టపడే వాళ్ళు రాకపోలేరు. పెళ్లికాదేమోనన్న భయం అనవసరం" అనే ధీమా నాలో నిండుగా వుండ వుండాలి. ఆ ధైర్యంతోనే అనాలోచితంగా ప్రవర్తించాను.

అందం శాశ్వతం కాదని - కొద్ది కాలానికే అర్థమైంది. కాలంతో పాటు, వయసుతో పాటు శరీరంలో మార్పు వస్తుందని గ్రహించలేక పోయాను.

నా వయసు వాళ్లంతా పెళ్లిళ్లు చేసుకొని ఆనందంగా వుంటున్నారు. కొంతమంది తల్లులై సంసారంలో మునిగిపోతున్నారు.

నేను మాత్రం అట్లాగే వుండిపోయాను.

ఆ తర్వాత ఒకటి రెండు సంబంధాలు వొచ్చాయి.

నన్ను చూచి, అప్పుడే యవ్వనంలో అడుగు పెట్టిన మా చెల్లెల్ని అయితే చేసుకుంటామని చెప్పి వెళ్లారు.

ఇంట్లో ప్రతి రోజూ నా పెళ్లి గురించే చర్చలు.

నా పెళ్లి జరక్కుండా, చిన్నదైన చెల్లెలు పెళ్లి చేస్తే ఏం బావుంటుంది? కాని వొచ్చిన సంబంధాలన్ని ఇట్లాగే వొదులుకోవటం ఇంట్లో ఇష్టంలేదు.

రోజులో ఒక్కసారైనా ఏదో ఒక సాకు పెట్టి అమ్మ రుస రుసలాడటం మొదలుపెట్టింది.

ఏం చేస్తాను? ఏం చేయగలను? చేతులారా నేనే ఈ క్లిష్ట పరిస్థితి ఏర్పరిస్తిని. పూర్వంలా కోపం, గర్వం తగ్గిపోయాయి. వింటూ మౌనంగా వుండిపోవడం అలవాటు చేసుకున్నాను.

మనలాంటి మధ్యతరగతి సంసారాల్లో సవ్యమైన సంబంధం రావాలంటే - ఎంత కష్టమో! నిజంగా అప్పుడే తెలిసింది. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ప్రయోజనం ఏముంటుంది.

సరే! నా రాత అట్లా తగలడిందని వుంతటానికి కూడా ఆస్కారం లేకపోయింది. నా మూర్ఖత్వానికి, తెలినితనానికి నా చెల్లెలు జీవితం కూడ బలియై పోతుందేమోనన్న దిగులు నన్ను అమితంగా క్రుంగదీసింది.

ఆ ఆలోచనలో, దిగులుతో రోగిష్ఠి దానిలా తయారయ్యాను. అట్లాగే కొంతకాలం ఉంటే ఏమైపోయేదాన్నో!

భగవంతుడు కరుణామయుడు. నాకు ఉద్యోగం వొచ్చింది. 'ఆర్డర్స్' చూస్తుంటే కన్నీళ్లు జలజలా రాలాయి.

ఉద్యోగంలో చేరాను. కొంత వ్యాపకం మారింది. అయినా గుండె లోతుల్లో ఏదో బాధ దాక్కొని వుండేది.

పెళ్లి చూపులకు కూచోటం మానుకున్నాను నగ్గేసి. నాతో సంబంధం లేకుండా వయసు వొచ్చి మీద పడుతూనే ఉంది.

అమ్మ వాళ్లు ఎంత చెప్తున్నా వినకుండా - మా చెల్లెలి పెళ్లి జరిపించాను. నేను చేసిన పనికి అందరూ శిక్ష అనుభవించటం ఏం న్యాయం? అదృష్టవశాత్తు మంచి కుర్రాడు దొరికాడు. చూడ చక్కగా వాళ్లిద్దరూ వెళ్తుంటే చూసి తృప్తిపడ్డాను.

అప్పటికి - నా వ్యధ తీరిపోయింది.

మనసులోని బాధ పూర్తిగా మాసిపోయింది.

ఇహ నా పెళ్లి ఆలోచనలు మానుకున్నాను. ఆశ కూడా లేదు. ఎప్పుడైనా ఒక్క రాత్రి ఆలోచన వచ్చేది.

# వెన్నెల కురిసిన రాత్రి

పిల్లాడలా నా మనసు రవంత ఆశతో నాలుగు వైపులా చూసేది. రివ్వున పరుగులు తీసేది. అంతలోనే తిరిగి యథాస్థానంలోకి వొచ్చేసేది. ఎప్పుడో నీళ్లు నిండిన కళ్లతో, వొదిగి అట్లాగే పడుకొనేదాన్ని.

తెల్లారితే - మామూలే. ఆఫీసు, పని - ఇల్లు. కాని నా మానాన నన్ను వొదలడంలేదు ఈ సమాజం. ముఖ్యంగా ఆడాళ్లు. సాటి స్త్రీననే జాలి కూడ లేకుండా భయంకరంగా మాట్లాడుకునే వాళ్లు. ఎన్ని పుకార్లు! ఎన్ని మాటలు -

ఈ వయసులో పెళ్లి లేకుండా ఎట్లా వుంటోంది? ఎవరితోనైనా అక్రమ సంబంధం వుండి వుంటుంది - అని వాళ్లకి వాళ్లే సమాధానపరచుకునేవాళ్లు. ని. ఐ. ఏ. ల్లా ఆరా తీశారు. చేయవలసిన పనులన్నీ చేశారు.

మొదట్లో కోపం వచ్చేది - ఏడుపు వచ్చేది. క్రమంగా నవ్వుతో వాళ్ల మాటలు పట్టించుకోవటం మానుకున్నాను.

విన్న ఎల్లప్పు. నీకు తెలుసు ఆ బాధ. కాని ఏమి చెయ్యగలను? వాళ్లలో మార్పు రాదు. ఈనాటికి నాకు నమ్మకంలేదు. ఇప్పుడు పైకి అందరూ బాగుంటున్నారు. లోపల ఇంకెంత మనుషులు వున్నారని వాళ్ల చూపులే సాక్ష్యం.

జీవితం చాలా నేర్పింది. మనుష్యుల్తో ఎట్లా మసలుకోవాలో అర్థం చేసుకొన్నాను. అందుకే అవసరానికి తప్ప మాట్లాడటం మానుకున్నాను ఒక్క మీ అమ్మతో మాత్రం మనసు విప్పి మాట్లాడేదాన్ని.

ఇంత పెద్ద లోకంలో నాకు తోడు, నీడ - మీ అమ్మ.

'ఇప్పటికి మించిపోయింది లేదు' - అని మీ అమ్మ అంటున్నా, నవ్వుతో వెళ్లిపోయేదాన్ని. అట్లాగే వుండిపోయాను. జీవితంలో మూడు వంతులు అయిపోయింది. ఇంకెంత కాలం"

ఆ మాటతో ఆగిపోయింది - నాగలక్ష్మి. ఆమె కంఠంలో మార్పు వొచ్చింది. వెన్నెల్లో ఆమె కంట తడి తళుక్కుమంది.

అంతా వింటున్న వసంత చలించి పోయింది. చాలాసేపు తర్వాత - "అత్తయ్యా" అంది వసంత.

కనపడకుండా కంటితడి తుడుచుకుని - వసంత వైపు చూసింది.

"సారీ అత్తయ్యా"

నాగలక్ష్మి నవ్వుతూ -

"పిచ్చి పిల్లా. ఇది నా బాధ కాదు. తృప్తి." అంది.

వసంత వంక ప్రేమగా చూస్తూ

"వసంతా! నువ్వు అర్థం చేసుకోలేని పసిపిల్లవు కాదు. నా గతం ఎందుకు చెప్పానో నీ వూహకు అంది వుంటుంది. నా ఆలోచన ఒకటేనమ్మా" తెలిసి తెలియని నిర్ణయాలతో ఏ ఆడపిల్లా నాలాంటి స్థితిని కల్పించుకోకూడదు. అదే నా తపన." అంది నాగలక్ష్మి.

వసంతకి తటాలున అర్థంకాలేదు కాని ఆమె మాటలు చిన్నగా మనసును చేరుకున్నాయి. వసంత వంక చూడకుండానే మాట్లాడుతోంది నాగలక్ష్మి.

"అమ్మ అంతా చెప్పింది. పెద్దల నిర్ణయాలన్ని నిజమైనవి, పిల్లల ఆలోచనలు అర్థంలేనివి - అని పూర్తిగా అనటంలేదు. కాని ప్రతి నిర్ణయానికి అర్థవంతమైన కారణం వుండి తీరాలి".

"కారణం ఏమి లేదు అత్తయ్యా. అప్పుడే పెళ్లి ఎందుకు? అనిపిస్తోంది" వసంత కూడబలుక్కొంటున్నట్లు అంది.

"ఏ వయసులో ముచ్చట ఆ వయసులో జరగాలి. పెళ్లికూతురు సిగ్గు ఆడపిల్లలోను, పెళ్లికొడుకు కళ మగాడిలోను వున్నప్పుడు చేసుకుంటేనే ముచ్చట. కాదంటావా?"

వసంత మాట్లాడలేదు.

ఆ పిల్ల ఆలోచించుకోటానికి కాస్త సమయమిచ్చింది నాగలక్ష్మి. ఎంతకీ వసంత నుంచి సమాధానం రాకపోయేసరికి తనే మళ్లీ చెప్పింది.

"ఎవరి అభిప్రాయాలు వాళ్లకు వుండవచ్చు. అందులో తప్పులేదు. నా అభిప్రాయం బలవంతంగా నీ మీద రుద్దటం నాకు అసలు ఇష్టంలేదు. నీకై నువ్వే ఆలోచించుకో. నిర్ణయించుకో. జీవితం నీది. చెప్పవలసిన బాధ్యత కొద్దీ చెప్పాను. నీ ఇష్టం".

మబ్బుల చాటుకి వెళ్తూ - వస్తూ చరచరా పరుగులెత్తుతున్నాడు ఆకాశంలో చందమామ.

నాగలక్ష్మి ఆకాశం వైపు చూస్తూ కళ్లు మూసుకుంది.

వసంత నిద్రపోలేదు.


చూస్తూ వుంది - ఆకాశం వొంక, భవిష్యత్తు వంక.

★ ★ ★ ★ ★

సిగ్గుతో మొగ్గలా, పెళ్లి పీటల మీద వొదిగి కూర్చొని వున్న వసంతను కళ్లారా చూస్తూ నిలబడి వుంది నాగలక్ష్మి.

ఇందిర కృతజ్ఞతతో మృదువుగా నాగలక్ష్మి చెయ్యి నొక్కుతూ "నాగూ" అంది.

పెళ్లి మేళాలు తారాస్థాయి నందుకున్నాయి. □




## పాఠ్యపుస్తకాల్లో సినిమాపాటలు

[illegible]